# నిరసనలకే పరిమితమైన టీబీజీకేఎస్



**ఉద్యమ కెరటం, తాండూర్:** బెల్లంపల్లి ఏరియాలో టీబీజీకేఎస్ నాయకులు నిరసనలకే పరిమితమయ్యారని బెల్లంపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్ విమర్శించారు. గురువారం సెంట్రల్ డిప్యూటీ సెక్రటరీ సంగెం ప్రకాష్ రావుతో కలిసి మాట్లాడారు. బెల్లంపల్లి ఏరియాలో టీబీజీకేఎస్ అని చెప్పుకునే కొంతమంది నాయకులు కొన్ని డిమాండ్లపై నిరసన తెలుపుతున్నారు కానీ గత పది సంవత్సరాలు వారే గుర్తింపు సంఘం ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. మొన్నటికి మొన్న జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోరాటం చేత కాక చేతులెత్తేసి ఏఐటీయూసీతో అక్రమ పొత్తులు పెట్టుకుని ఎన్నికల్లో గెలిచారని ఆరోపించారు. గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘంగా బెల్లంపల్లి ఏరియాలో వ్యవహరిస్తున్న ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు ఇప్పటికీ కలిసి కంపెనీలు పెట్టే వివిధ కమిటీల్లో కొనసాగుతున్నారని తెలిపారు. ఈ వ్యవహారాన్ని మరిచిపోయి కార్మికులను మభ్యపెట్టడానికి కొంతమంది అధికారులను భయభ్రాంతులకు గురిచేసి పొత్తు ఉన్న ఏఐటీయూసీని చేతకాని సంఘం అని ఎద్దేవా చేస్తూ వారి పబ్బం గడుపుకోవడానికి ఈ నిరసనలు తప్పా కార్మికులకు న్యాయం చేయాలనే ఎంత మాత్రం లేదన్నారు. టీబీజీకేఎస్ లోనే గౌరవ అధ్యక్షురాలుగా ఉన్న కవితక్క హెచ్ఎంఎస్ తో కలిశారని, అసలు టీబీజీకే సంఘమే బీఆర్ఎస్ కు సంబంధం లేదని చెప్పిన నాయకులు మళ్లీ కార్మికులను మోసం చేయడానికి కంపెనీని దోచుకున్నది చాలనట్టు తెరపైకి వస్తున్నారన్నారు. ప్రాతినిధ్య సంఘంగా ఉన్న ఐఎన్‌టీయూసీని ప్రభుత్వాన్ని విమర్శిస్తే తగిన బుద్ధి చెప్తామని తెలిపారు. మా యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ చొరవతో కారుణ్య నియామకాలు 35 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలకు పెంచిన ఘనత ఇంటక్ ది కాదా, ప్రభుత్వానిది కాదా అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ రూ. 5వేలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని, దీన్ని మర్చిపోయి టీబీజీకేఎస్ నాయకులు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. కార్మికులు, ప్రజలు టీబీజీకేఎస్ ను, ఏఐటీయూసీ నీ గాని నమ్మే పరిస్థితిలో లేరని, ఐఎన్ టీయూసీ నాయకులు కార్మికుల పక్షాన ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు మాధవ కృష్ణ, చంద్ర కుమార్, సోకాల శ్రీనివాస్, బూర శ్రీనివాస్, గోలెం గట్టయ్య, మాసడి నారాయణ, రామ్మోహన్, మిట్టపల్లి కుమార స్వామి, బోయిన రాజేశం, వామన్ కుమార్, అంబేద్కర్, పిట్ కార్య దర్శులు భాస్కర చారి, కందుల తిరుపతి, కొంక భీమేష్, దుంద్ర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే



**ఉద్యమ కెరటం, జన్నారం:** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి పొంగి పొర్లడంతో గోదావరి పరివాహక ప్రాంతాలైన తిమ్మాపూర్, రాంపూర్, తపాలాపూర్, చింతగూడ గ్రామాలను గురువారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడారు. గ్రామాల్లో వరి, జొన్న పత్తి పంటలు పూర్తిగా నీటమునిగాయని వాపోయారు. అంతే కాకుండా నీటి తాకిడికి రోడ్లు, డ్రైనేజిలు దెబ్బతిన్నాయని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం అందేలా కృషి చేయాలన్నారు. దెబ్బతిన్న డ్రైనేజీలు, రోడ్లు, విద్యుత్ స్తంభాలకు తక్షణమే మారమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రకృతి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని ప్రజలకు సేవ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పోస్ట్ మాస్టర్ కు సన్మానం

**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండల కేంద్రంలోని తపాల కార్యాలయానికి ఇటీవల నూతనంగా బాధ్యతలు తీసుకున్న పోస్ట్ మాస్టర్ సంజిత్ కు బౌద్ధ, అంబేద్కర్ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలబొకే తో సన్మానం చేశారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ మండలంలోని వాంకిడి, ఇంథాని, కిర్డి, కనర్గాం, కమన, వెలిగి, బొంబార సబ్ పోస్ట్ ఆఫీసుల పరిధిలోని గ్రామాల ప్రజలు చేసే ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి డబ్బులు, వృద్ధులకు ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పథకం డబ్బులు వారికి ఆలస్యం చేయకుండా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల భారతీయ బౌద్ధ మహాసభ గౌరవ అధ్యక్షులు జయరాం ఉప్రే, సమాజ్ అధ్యక్షులు శ్యామ్ రావు లహుజీ దుర్గే, రాజేశ్వర్ ఉప్రే ఉపాసకులు పాండుజి, దేవాజీ మహాత్మే, శ్రీధర్, పలువురు గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## లోపించిన పారిశుధ్యం

వీధి దీపాలు లేక చీకటిలో కాలనీ

**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వాసన వెదజల్లి ముక్కులు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఒకవైపు డ్రైనేజీ కంపు, మరోవైపు కాలనీలో వీధి దీపాలు లేక చీకటిలో ఉంటున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ముందే వర్షకాలం, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీల్లో చెత్తాచెదారం చేరింది. దుర్వాసనతో సీజనల్ వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పారిశుద్ధ్య పనులు చేపట్టి, కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## కొలువు దీరిన గణనాథుడు

**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండల కేంద్రంలోని హనుమాన్ బస్తీ, ఇందిరానగర్, శివాకేశవనగర్, రామ్ నగర్, అర్జుగూడ, బెస్తవాడ, లక్ష్మి నగర్, పెర్కావాడ, శివాలయం తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గణనాథుడు కొలువు దీరాడు. భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 21 రకాల కూరగాయలతో, పిండి వంటలు స్వామి వారికీ నైవేద్యంగా సమర్పించారు. రాత్రి వేళల్లో మండపాల్లో భజన కార్యక్రమాలు నిర్వహించారు. మండపాలను శోభయానంగా విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



# పంట నష్టం సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో భారీ వర్షాలు కురు-స్తున్న నేపథ్యంలో జరిగిన పంట నష్టం సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయ చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వ్యవసాయం, ఉద్యానవన పంట నష్టాల గణన, ఆయిల్ పామ్ సాగు, యూరియా సరఫరా, పర్యవేక్షణ వంటి ముఖ్య అంశాలపై చర్చ జరిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, జిల్లా వ్యవసాయ శాఖాధికారులు, ఫ్యాక్స్, హార్టికల్చర్, డీఎం మార్క్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సమర్థవంతమైన మద్దతు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారిగా సర్వే ప్రక్రియ పై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు సర్వే చేశారు, ఇంకా ఎన్ని ఎకరాలు సర్వే చేయాలి, ఫార్మాట్, ఎక్స్ ఎల్ లో ఎంట్రీ చేయాలని తెలిపారు. సర్వే పూర్తి కానీ మండలాల్లో వేగవంతం చేసి త్వరగా నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తయిన మండలాల ఏఈఓలను పూర్తి కాని మండలాల గ్రామాలకు పంపించి తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహానికి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్ ఫాం సాగు లక్ష్యాలను సాధించాలని, మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. యూరియా, ఇతర ఎరువుల సరఫరాపై పర్యవేక్షణ కఠినంగా ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే నాలుగు వారాల పాటు అత్యంత జాగ్రత్తలు పాటిస్తూ యూరియా పై ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తూ దాని లాభాల గురించి వివరించాలన్నారు. ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరలకు ఎవరైనా అమ్మినట్లు ఫిర్యాదుల వస్తే ఏఈఓలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆగస్టులో నిర్వహించిన మాదిరిగానే సెప్టెంబర్ లో కూడా యూరియా స్టాక్ వివరాలు, ఈపాస్ యంత్రాలు, ప్రతిరోజూ ఓపినింగ్ బ్యాలెన్స్, యూరియా స్టాక్ వివరాలను 23 ఫ్యాక్స్ కేంద్రాల్లో బోర్డులు ఏర్పాటు చేసి ప్రదర్శించాలని పేర్కొన్నారు. బిల్ బుక్ మెయింటేన్ చేయాలని, సిట్టింగ్ అధికారులు అందుబాటులో ఉండాలని, ఆయిల్ ఫాం నెలవారీ లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులకు తగిన మార్గదర్శకాలను జారీ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ శ్రీధర్ స్వామి, డీసీవో మోహన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లప్పుడూ సామాజిక సేవలో అంజనీ పుత్ర సంస్థ ముందుంటుంది

అంజనీ పుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఎల్లప్పుడూ సామాజిక సేవలో అంజనీ పుత్ర సంస్థ ముందుంటుందని అంజనీ పుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి అన్నారు. గురువారం మంచిర్యాలలో అంజనీపుత్ర ఎస్టేట్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రోత్సవాల్లో మొదటి రోజున 2 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్న దానం గొప్పదని. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో అంజనీ పుత్ర అన్నదాన కార్యక్రమాలకు ప్రత్యేక స్థానం ఏర్పడిందన్నారు. దాదాపు వినాయక ప్రతిమ ప్రతిష్ఠించిన ప్రతిచోటా అన్నదానం తప్పనిసరయింది జనాభా సంఖ్యకు అనుగుణంగా భారీగానే అన్నదానం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం లో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లుసూరినేనీ కిషన్, కాసర్ల సదాందం, డైరెక్టర్ లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యా బోధనకు కృషి చేయాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనకు కృషి చేయాలని జిల్లా మాద్యమిక విద్యాధికారి గణేష్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనఖీ చేశారు. కళాశాలలో బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ నిర్వహించే ఆన్‌లైన్ తరగతులతో పాటు విద్యార్థుల హాజరు శాతం, సంబంధిత రికార్డ్ లను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశాన్నిఏర్పాటు చేసి ఆన్‌లైన్ క్లాస్ లు, విద్యా బోధన పట్ల ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హజరు శాతం పెంచాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాభోదన పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో పిన్సిపల్ శబాన తరన్నుమ్, లెక్చరర్లు, సుభాష్, ప్రవీణ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా తగు చర్యలు చేపట్టాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి మనోహర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఓపీ రిజస్టర్, ప్రసవ గదీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుడూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరుపుకునేలా అవగాహన కలించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఈఓ పవర్ రవీందర్, మెహన్ బాపూజీ, వాణి ఉత్తమ్ సింగ్, సాయన్న, నర్సయ్య తదితరులు ఉన్నారు.

## జడ్జి బాధ్యతల స్వీకరణ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జిగా కుంభ సందీప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నూతన జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీపీ శ్రీధర్, బోథ్ జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పంద్రం శంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్ రావ్ దేశ్ పాండే, ఉపాధ్యక్షులు దమ్మాపాల్ అంగద్, ఆడెపు హరీష్, రూపేందర్ సింగ్, కుమ్మరి విజయ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు వాహనాన్ని ఢీకొన్న కంటైనర్

## సీఐ తోపాటు డ్రైవర్ కు గాయాలు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పెన్‌గంగా బ్రిడ్జి డొల్లారా గ్రామం వద్ద పోలీసు విధులు నిర్వర్తిస్తుండగా గురువారం ఆగి ఉన్న పోలీసు వాహనాన్ని వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనంలో కూర్చుని ఉన్న జైనథ్ సీఐ డి సాయినాథ్, వాహనం బయట ఉన్నడ్రైవర్ షబ్బీర్ లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆసుపత్రికి చేరుకొని వారిని పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి నెలకొన్నమెరుగైన సేవల నిమిత్తం సమాచారం అందించి ఉత్తమ వైద్య చికిత్సలను అందించేలా పర్యవేక్షించాలని డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డికి సూచించారు.

# ఫోర్జరీ పత్రాలతో ఓటు హక్కును మార్పిడి చేసిన నలుగురి అరెస్టు

## ఫోర్జరీకి సహకరించిన ఆర్ఐ రిమాండ్

**ఉద్యమ కెరటం, నేరడిగొండ (ఇచ్చోడ):** ఫోర్జరీ పత్రాలతో ఓటు హక్కును మార్పిడి చేసిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఇచ్చోడ సీఐ బండారి రాజు గురువారం విలేకరులకు తెలిపారు. వివరాల ప్రకారం తేదీ 25న ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో ఇచ్చోడ మండలంలోని అడిగాం(బి) గ్రామానికి చెందిన కథం వనిత, కదం సుభాష్, భార్య భర్తలు అడిగం(బి) గ్రామం నుంచి వారి ప్రమేయం లేకుండా వారి ఓట్లు ఇచ్చోడ గ్రామానికి బదిలీ అయ్యాయని మండల తహశీల్దార్ సత్యనారాయణరావు దరఖాస్తు మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్లో ఫోర్జరీ సెక్షన్ కింద కేసు నమోదైంది. 27న నిందితులను పట్టుకొని విచారించగా వారు కదం విశాల్, సిందే అచ్యుత్, కదం ధనరాజ్ నకిలీ రెసిడెన్షియల్ సర్టిఫికెట్ తయారు చేసి ఎలక్ట్రోరల్ పోర్టల్ లో ఫారం-8 లో దరఖాస్తు చేసి రెవెన్యూ అధికారుల సహాయంతో ఓటు హక్కు అడిగాం(బి) గ్రామం నుంచి ఇచ్చోడ గ్రామానికి మార్చడం జరిగిందని తెలిపారు. ఇందుకు సహకరించిన ఆర్ఐ ఇచ్చోడ హుస్సేన్ ను కూడా నిందితుడుగా చేర్చడం జరిగిందన్నారు. ప్రాథమిక విచారణ అనంతరం కదం విశాల్, సిందే అచ్యుత్, కదం ధనరాజ్, హుస్సేన్ లను రిమాండ్ కు తరలించడం జరిగిందని పేర్కొన్నారు.

# మీలాద్ దరూద్ కా దస్తర్ విజయవంతం



**కరీంనగర్, ఆగస్టు 28:** మానవాళికి మార్గాన్ని చూపిన మహనీయుడు.. అజ్ఞానపు అంధకారంలోంచి, ప్రపంచాన్ని వెలికితీసి వెలుగులు నింపిన మహానుభావుడు.. సర్వ మానవాళికి శ్రేయోభిలాషిగా నిలిచే నైతికతలపై వెలుగులు నింపిన గొప్ప ప్రవక్త ( మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) అని, ఆయన చూపిన మార్గంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ నడవాలని, వారి సూచనలను అనుసరించి జీవితం గడపాలని సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫీజ్ సయ్యద్ మొయినుద్దీన్ ఖాద్రీ యూసుఫ్ అన్నారు. సున్నీ మర్కజి మీలాద్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఎంఐఎం కార్యాలయం దారుస్సలాంలో.. ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అధ్యక్షతన మిలాదున్నబీ సందర్భంగా ఒక లక్షా పాతిక వేల సార్లు దరూద్ షరీఫ్ పఠనం జరిగింది. ఈకార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. ఈసందర్భంగా మౌలాన అబుల్ కలాం మిస్బాహి, మౌలాన ఖయ్యుమ్ జియాయి మాట్లాడుతూ క్రీస్తు శకం 15వ శతాబ్దంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రస్తుత గల్ఫ్ దేశాల ప్రతికూల పరిస్థితుల్లో జన్మించారని, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) క్రీ.శ. ప్రపంచం మొత్తం చీకటి నుండి బయటపడింది. ఆయన మీ జీవితంలోకి తీసుకురావడానికి వచ్చిన వెలుగు యావత్ మానవాళికి ఆదర్శం, ఆయన చూపిన మార్గంలో పయనిస్తే స్వర్గానికి చేరుకుంటారన్నారు. మౌలానా అబుల్ కలాం మిస్బాహి ప్రవక్త (స) అద్భుతాలను, విజయాలను వివరించారు. హాఫీజ్ యూసుఫ్ ఖురాన్ పఠనంతో కార్యక్రమం ప్రారంభమైంది. హాబీబ్ ఖాద్రి నాత్ చదివిన అనంతరం చివరగా దుఆ జరిగింది. ప్రత్యేకంగా ఎంఐఎం వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత అబ్దుల్ వాహేద్ ఒవైసీ, మాజీ ఎంపీ, మాజీ ఎంఐఎం అధ్యక్షుడు దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసిలకు అల్లాహ్ స్వర్గం ప్రసాదించాలని, ప్రస్తుత ఎంఐఎం పార్టీ అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసిల కోసం ఆయురారోగ్యాలతో ఉండాలని దుఆ చేశారు. సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ ప్రతినిధులు, ఎంఐఎం నగర కమిటీ సభ్యులు, మాజీకార్పొరేటర్లు, ఎంఐఎం డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారు



## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని భారత్ రాష్ట్ర సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం బెజ్జూర్ మండల కేంద్రంలో తొలిసారిగా వచ్చిన ఆయనకు సీనియర్ నాయకులు అర్షద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. సలుగుపెల్లి వారసంత నుంచి బెజ్జూర్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో తెలంగాణ రాష్ట్ర సమితి నినాదాలు చేశారు. అనంతరం బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణలో మళ్ళీ కేసీఆర్ పాలన ను ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో వార్డు మెంబర్ మొదలు జెడ్పీటీసీ వరకు బీఆర్ ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 హామీలు, 420 వాగ్దానాల్లో ఏ ఒక్కటి నేటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో ఓపక్క రైతులు యూరియా కోసం కార్యాలయాల వద్ద బారులు తీరుతుంటే, వరదలు వచ్చి తెలంగాణ ప్రజలు అల్లాడుతుంటే, ఫీజు రియంబర్స్‌మెంట్ లేక విద్యార్థులు పై చదువులకు వెళ్లలేకుండా ఇబ్బందులు పడుతుంటే మరోపక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీహార్ ఎన్నికల్లో హెలీక్యాప్టర్లను అప్పజెప్పి జల్సాలు చేస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ సమస్యలపై దృష్టి పెట్టాల్సిన సీఎం బీహార్ పై దృష్టి పెట్టారని అన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు ఏనాడు ఇబ్బందులు పడలేదని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు తెలంగాణ బిడ్డలకు ఇంటింటికి అందాయని తెలిపారు. ఇక సిర్పూర్ నియోజకవర్గానికి వస్తే రాష్ట్రమంతా ఓ తీరు ఉంటే.. ఇక్కడ మరో తీరుందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి అందని ద్రాక్షగా మారిందని, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లే రోడ్డు చూసినా వాహనాలు వెళ్ళలేని పరిస్థితి ఉందన్నారు. ఇక పోడు రైతులను అటవీ శాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని, అందుకు కారణం ప్రస్తుత ఎమ్మెల్యేనే అన్నారు. ఎమ్మెల్యే అసెంబ్లీలో ఆటవిలోని చెట్లు తగ్గుతుంటే మీరేం చేస్తున్నారని ప్రస్తావించడంతో అటవీ శాఖ అధికారులు రైతులపై ప్రతాపం చూపిస్తున్నారని తెలిపారు. సిర్పూర్ ప్రజలకు మీ ఎమ్మెల్యే ఎవరు అని అడిగితే హరీష్ బాబును గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవే చేశారు. తమ సొంత మండలంలో ఈ పరిస్థితి ఉండటం దారుణమని పేర్కొన్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల విషయం చూస్తే ఇంకా దారుణంగా ఉందన్నారు. ఈ ఇండ్ల నిర్మాణం కోసం బెజ్జూర్ మండలం, గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హులను పక్కనపెట్టి నచ్చినవారికి, వారి బంధువులకు ఇస్తున్నారని విమర్శించారు. అర్హత ఉండి ఇల్లు లేని పేదలు ఎంతోమంది బెజ్జూర్‌లో బాధపడుతుంటే అర్హత లేకుండా ఇండ్లు ఇచ్చిన అధికారులను ఏం చెప్పాలని అన్నారు. కమిటీ సభ్యులు అధికారులను బాధ్యులు చేస్తూ తగు విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను కోరుకున్నట్లు తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బెజ్జూర్ మండల అధ్యక్షుడు బూస సారయ్య యాదవ్, సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కన్వీనర్ శ్యాంరావు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, కౌటాల మాజీ ఎంపీపీ విశ్వనాథ్, సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**ఉద్యమ కెరటం, సిర్పూర్ (టి):** బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం సిర్పూర్ మండలంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పండుగ రోజు కూడా వర్షంలో యూరియా కోసం రైతులు లైన్లలో నిల్చుంటే, రాష్ట్ర ముఖ్యమంత్రి బీహార్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. యూరియ ఇవ్వనంటే కాంగ్రెస్, బీజేపీ రాజకీయాలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వం యూరియా ఇవ్వలేదంటుంటే, బీజేపీ ఇచ్చామంటుందని, మధ్యలో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వాస్తవానికి యూరియా కొరతకు కాంగ్రెస్, బీజేపీ పార్టీల బ్లాక్ దందానే కారణమన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తమ అనుచరుల ద్వారా యూరియా తీసుకొని బ్లాక్ లో అధిక ధరలకు అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. రైతుల నుంచి దోచుకున్న సొమ్మును రేవంత్ రెడ్డి ఢిల్లీకి పంపుతున్నారని స్పష్టం చేశారు. మరోపక్క విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక అవస్థలు పడుతుంటే, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రూ.8వేల కోట్లు బకాయిలు ఉండడంతో యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడంలేదని తెలిపారు. బీటెక్, ఫార్మసీ విద్యార్థులు పైచదువులకు వెళ్ళలేక, ఉద్యోగాలకు అప్లై చేసుకోలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా శాఖ మంత్రి ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. బెస్ట్ అవలైబుల్ స్కీం పెండింగ్ బిల్లులు కూడా విడుదల చేయడం లేదని, పేద విద్యార్థులు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వంటి ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య పొందలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల టెండర్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మెఘా కృష్ణా రెడ్డి, సీఎం రమేష్ వంటి వారికి ఇస్తున్నారు కానీ, విద్యార్థుల బకాయిలు మాత్రం చెల్లించడం లేదన్నారు. విద్యార్థులకు డబ్బులు లేవు కానీ కాంట్రాక్టర్లకు ఇవ్వడానికి డబ్బులున్నాయా అని నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు మోసపోయారని, అందుకే తెలంగాణలో తిరిగి కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో ప్రాణహిత నది పొంగి ప్రవహించడం ద్వారా వేల ఎకరాల్లో పంటకు నష్టం కలిగిందన్నారు. ప్రభుత్వం బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిర్పూర్ మండల కేంద్రంలో అనేక సమస్యలున్నాయని, బస్టాండ్, డ్రైనేజీ సౌకర్యం లేదని, వంద పడకల హాస్పిటల్ ఉన్నా వైద్యులు, సిబ్బంది లేరని, జనరేటర్ పనిచేయడంలేదని, వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సిర్పూర్ మండలంలోని ఆరెగూడ, వెంకటరావుపేట్, డోర్ పల్లి, బెంగాలీ క్యాంపులో పర్యటించిన ప్రవీణ్ కుమార్ గ్రామస్తులను బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిర్పూర్ గత ఎన్నికల్లో నన్ను ఆదుకుందని, 45వేల మంది ఓట్లు వేసి నాకు అండగా నిలిచారని గుర్తుచేశారు. అలాంటి సిర్పూర్ ప్రాంతాన్ని నేను విడిచిపెట్టేది లేదని తేల్చి చెప్పారు. పార్టీ అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగానే పనిచేస్తానని, సిర్పూర్ ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానని, ఎలాంటి ఊహాగానాలు, పుకార్లను నమ్మకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, మండల కన్వీనర్ అస్లం, సీనియర్ నాయకులు చాంద్ పాషా, కొంగ సత్యనారాయణ, నియోజకవర్గ మహిళా నాయకురాలు లలిత, మండల నాయకులు హీరామన్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

# అంజనీ పుత్ర ఎస్టేట్ ఆధ్వర్యంలో అన్నదానం

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** మంచిర్యాలలోని అంజనీపుత్ర ఎస్టేట్ ఆధ్వర్యంలో గురువారం వినాయక నవరాత్రోత్సవాల్లో మొదటి రోజున 2వేల మందికి అన్నదానం నిర్వహించారు. భక్తుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అంజనీపుత్ర సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి మాట్లాడుతూ అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని అన్నారు. సామాజిక కార్యక్రమాల్లో అంజనీపుత్ర సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో అంజనీపుత్ర అన్నదాన కార్యక్రమాలకు ప్రత్యేక స్థానం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లుసూరినేనీ కిషన్, కాసర్ల సదాందం, డైరెక్టర్ లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



